# చిన్నారి రాజు!

తెల్లవారుఝామున చలి బాగానే ఉంది. రెండో శనివారం కావడంవల్ల రగ్గు కప్పి హాయిగా నిద్రపోతున్నాడు కృష్ణమూర్తి. కోడికేనా మతిపరుస్తు ఉంటుందేమోగాని పార్వతికి ఉండదు; పాలవాడి కేకకుముందే తెలివి వచ్చేస్తుంది. లేస్తూనే బద్ధకంగా అనిపించిందా రోజు పార్వతికి. 'ఈపూట ఒంట్లో బాగు లేకపోతే ఏం?' అనుకొంది. నిశ్చింతగా దుప్పటి కప్పుకుని పడుకోవాలనుకుంది. 'నాకింత బద్ధకంగా ఉంటే, ఒంట్లో బాగుండలేదనేగా? ఎవ రేమనుకుంటారేం,' అని లేచింది — ఎందుకేనా మంచిది — థర్మామీటరుతో జ్వరం కొలిచి చూసుకుందామని.

పార్వతి లేచిన అలికిడికి కృష్ణమూర్తి ఇటునుంచి అటు దొర్లి పడుకున్నాడు. చప్పుడుచేయకుండా బీరువా అరలు లాగి థర్మామీటరుకోసం వెతకడం ప్రారంభించింది పార్వతి. 'నాకు ఒంట్లో భారంగా ఉందని ఎవరికీ చెప్పను. అనవసరంగా భయపడతాడు కృష్ణమూర్తి!' అనుకుంటూ కాగితాల అడుగున, జేబురుమాళ్ళ మధ్యన థర్మామీటరుకోసం వెదుకుతూంది. 'అంతగా జ్వరం ఉంటే — ఓ ఏస్ప్రిన్ వేసుకు ధైర్యంగా తిరుగుతాను' అనుకుంది. 'రాత్రి పడుకోబోయేదాకా ఎలాగో అలాగ తిరుగుతాను. అప్పుడే పడుకుంటూ 'ఆఁ, ఏంచెప్పను. కొంచెం బద్ధకంగా ఉందీ రోజు... అసలు రోజంతా కొంచెం జ్వరం కాస్తూనే ఉందిసుమో... ఏం పరవాలేదు; అదే పోతుంది. మహా మాటవరసకేగా" అంటాను. అప్పుడు — 'ఆమాత్రందానికే కృష్ణమూర్తి హడావిడి పడిపోతాడు రామాలు!' తనలా చెప్పినప్పుడు కృష్ణమూర్తి ముఖం ఎలా ఉంటుందో ఊహించుకుని నవ్వుకుంటూ థర్మామీటరు వేట సాగించింది పార్వతి.

ఇంత కంటె సామానులు శ్రద్ధగా ఉంచాలి ఇక మీదట. ఛి, ప్రతి చిన్న వస్తువుకోసం ఇంత వెతకాలా? జతలు లేని గాజులు, తిరగని గడియారం, సిగ సూదులు, వీటన్నిటినీ తొలగించి చూస్తూంది. 'బాబిగాడు పుట్టినపుడు కొన్న గాజులివి' అనుకుంది వెడల్పు గాజు ఒకటి చేతికి తగిలితే. అప్పుడే పెద్దవాడై పోయాడు! తమ్ముణ్ణి స్కూలుకి వెంటపెట్టుకు వెళుతూంటే, 'కాలం బంగారు రెక్కలు తగుల్చుకొని ఎంత త్వరగా పయనిస్తుంది!' ఆశ్చర్యపడింది పార్వతి. 'బాబిగాడు స్కూలుకి వెళ్ళిపోతే ఇక పాటీయే. ఎప్పుణ్ణుంచో చదవా

కె. రామలక్ష్మి

లని దాచిన పుస్తకాలు ముగించవచ్చు. సరదాగా చేద్దామనుకున్న పనులన్నిటికీ తెరిపి దొరుకుతుంది' సంతోషం నే నిట్టూర్చింది పార్వతి. ధర్మామీటరు ఎప్పటికి దొరుకుతుంది ?

'నాతో నేనే ఇలా ఎందుకు అబద్ధాలు చెప్పుకోవడం ? నే తలపోసినవి అసలు జరిగేది లేదని తెలిసీ ఎందుకీ ఎండమావులు సృష్టించుకోవడం ?' వింత పడింది పార్వతి.


'నాకు ఒంట్లో బాగులేదు అంతే అందుకే ఇలాంటి పిచ్చిపిచ్చి ఊహలు గూడులు అల్లుతున్నాయి.' అని సద్ది చెప్పుకుని – 'ఎక్కడుంటుంది చెప్మా ధర్మామీటరు ?' అని క్షణం ఆలోచించింది. 'అన్నీ ఎక్కడుండవలసినవి అక్కడ పెట్టడం అలవాటు చేసుకోవాలి ఇక మీదట' అనుకుంది. తనెప్పుడూ జాగ్రత్తగానే పెడుతుంది అన్నీ, కాని ఏం లాభం ! ఎక్కడ పెట్టిందో జ్ఞాపకం రాకపోతే ?

'నా కాగితాలు ఎక్కడ పెట్టావు పార్వతీ ?' అని అడుగుతాడు కృష్ణమూర్తి. 'నా టేబిల్ మీద పెట్టివెళ్లానే ?' అంటాడు. 'మిగిలిన పేపర్లతో కలిసి పోతాయని జాగ్రత్తగా పెట్టాను' అంటుంది పార్వతి కాని వచ్చిన చిక్కేమిటంటే – ఆ జాగ్రత్త అనుకున్న స్థలం ఏది అని ? 'జాగ్రత్త అయిన స్థలం' ఏదేనా కావచ్చు, ధర్మామీటరుకూడా ఇతర మందులతోపాటు గూట్లో ఉన్నా ఆశ్చర్యపడక్కరలేదు ! ధర్మామీటరు కోసం గాలిస్తూంటే ఎన్నాళ్ళనుంచో వెతుకుతున్న పెన్ను బయటపడింది !... ఇంకా ధర్మామీటరుకోసం వెతుకుతున్న పార్వతికి పక్కగదిలో నానిగాడు, బాబిగాడు ప్రారంభించిన 'ఫస్ట్‌రౌండ్' వినిపించింది !

ఫోను మ్రోగడం పార్వతికి వినబడలేదుగాని, 'నే తీస్తానంటే నే తీస్తా'నని పేచీ పడుతున్న కుర్రాళ్ళ గోల విన్పించి, బయటికి వచ్చింది. "ఎందుకిలా గోల చేస్తారు. నాన్నారు నిద్రపోతున్నారు కదా ? ఒరేయ్ బాబీ, నిన్న సాయంత్రం నువ్వు తీశావుగా ? ఇప్పుడు నానిగాణ్ణి తియ్యనీయి" అంది... అప్పటికే నేల మీద పడిఉంది ఫోను రిసీవరు. ఫోను మీద కంటే ఫోను పక్కనె అప్పుడే పెట్టినట్టున్న ధర్మామీటరు చూసి అదిరిపడింది పార్వతి. 'ఇక్కడి కెలా వచ్చింది ?'

ధర్మామీటరు తీసి చేత్తో పట్టుకుని ఫోను తీసి 'హల్లో' అంది. 'ఇంత భూకంపం వచ్చాక ఆ పిలిచినవ్యక్తి ధైర్యంగా ఎలా నిలబడతాడు ? పాపం!' అనుకుని ఫోను పెట్టేసి, ధర్మామీటరు నోట్లో పెట్టుకుంది పార్వతి. ఉజ్జాయింపుగా రెండు నిముషాలుంటే చాలేమో ! అనుకుంది.

కృష్ణమూర్తి పెద్దబూట్లు తొడుక్కుని నడవటానికి ప్రయత్నిస్తున్నాడు




నానిగాడు ఒకటి నాకిమ్మని లాగుతున్నాడు బాబిగాడు 'ఇంత పొద్దుటిపూట ఇంత ఉషారు ఎలా ఉంటుందీ పిల్లలకి' అని ఆశ్చర్యపడుతూ, బోర్లాపడతాడేమోనని ఊరుకోలేక 'ఒరేయ్ ... వెధవా, పడతావ్!' అంది ధర్మామీటరు నోట్లోంచి తీసి అనేసి మళ్ళా పెట్టుకుంది. కళ్ళపడకుండా ఉందామని కిటికీదగ్గరికి వెళ్ళి అవతలికి చూస్తూంది పార్వతి. రోడ్డు చివర గేదెవెనక హాంపనడకలు పడుస్తూ పాలవాడు వస్తున్నాడు. ఇంతలోకే ఒక్క కేకపెట్టాడు నానిగాడు. బాబిగాడు గడుసుగా వీధిలోకి నడిచాడు. పడవం బూటులో చిక్కుకున్న కాలు తీసుకుందుకు తంటాలుపడుతూ ఏడుస్తున్నాడు. బోర్లా పడ్డంతో నుదుటిమీద నిమ్మకాయంత బొప్పికట్టింది. 'ఎన్నిసార్లు చెప్పాను అంతపెద్దజోళ్లు వేసుకుంటే నడవలేవని మంచిపనైంది,' అంది ధర్మామీటరు నోట్లోంచి తీసి

'కాఫీ అయిందా పార్వతీ!' అంటూ బాత్ రూంలోకి దారితీశాడు కృష్ణమూర్తి. అంతే, ధర్మామీటరు ఎక్కడ పెట్టిందో మరిచి వంటింట్లోకి దారితీసింది పార్వతి.

కాఫీలూ, పిల్లలకి నీళ్ళూ అయేసరికి స్కూలు టైమైంది పిల్లల్ని సర్ది టిఫెను పెట్టింది. 'వాళ్ళని స్కూలుకి పంపెయ్. తరవాత తింటాను' అన్నాడు కృష్ణమూర్తి

'ఇంత గోలగా ఉంటే ఏ మగవాడైతే మటుకు ఎలా భరిస్తాడు?' అనుకుంటూ పనిమనిషివెంట పిల్లల్ని స్కూలుకి

తరిమింది పార్వతి. 'పిల్లలిలా అడవి మృగాల్లాగా ఎందుకుంటారు!' అప్పటి కో వందసార్లు ప్రశ్నించుకుని ఉంటుంది: 'పిల్లలిలా ఉండటానికి తల్లి తండ్రులా బాధ్యులు? వీళ్ళకి నాగరికత ఎలాగ నేర్పడం!' అని. ఓ పక్కనుంచి ఆలోచిస్తూ ఇంకో పక్కనుంచి కృష్ణ మూర్తికి టిఫిన్ సర్దుతూంది పార్వతి. పిల్లలు స్కూలుకి వెళ్ళడంతో ఇల్లు కొంచెం నిశ్శబ్దం అయింది.


కడిగిన ముత్యంలా శుభ్రంగా తయారై టిఫినుకి వచ్చాడు కృష్ణమూర్తి. ఓ క్షణంపాటు తత్తరపాటుతో అతన్నే చూసింది పార్వతి. చిలిపిగా సన్నగిల్లి భుజంమీద చెయ్యివేశాడు కృష్ణమూర్తి. 'ఏం మగవాళ్ళు? తెల్లవారి ఇంత అవస్థ పడి ఒంట్లో బాగుండకపోయినా పని తమైపోతూంటే, ఇప్పుడీ సరసం ఏనికి? ఎలా ఉన్నదని అడగడానికి నోరు రాదేం' అనుకుంటూ మౌనంగా టిఫిను ముందుకి తోసింది పార్వతి. 'లైన్ క్లియర్' కాదని గ్రహించిన కృష్ణ మూర్తి గుప్‌చిప్‌గా టిఫిన్ ముగించి ఆఫీసుకు వెళ్ళిపోతూ, 'ఏం పారూ, కోపం వచ్చిందా?' అన్నాడు. ఎదురు చూడని ఈ ఆప్యాయతకి కంటనీరు తిరిగింది పార్వతికి. 'ఏంలేదే— పని తొందర' అనేసి అతగాడు వెళ్ళగానే వీధి తలుపు గడియలు వేసింది. పడకగదిలోకి వెళ్ళి హాయిగా వెల్లకిలా పడుకుని, మనస్సుగుత్తాల కళ్ళేలు సడలించింది పార్వతి.

'ఓ క్షణం నేను నేనుగా ఆలోచించు కుందుకు విశ్రాంతి చిక్కితే ఎంత హాయి!... ఈ కుర్రాళ్ళు స్కూలుకి వెళ్ళిపోయారు. చూస్తుండగానే బాబిగాడు ఫారాల్లోకి వచ్చేస్తాడు. ఇక తనకి ఎంత విశ్రాంతి!...'అని సుదీర్ఘంగా నిట్టూర్చింది పార్వతి. 'నే చేయదల్చుకున్న వన్నీ హాయిగా చేసుకోవచ్చు. మూల పెట్టిన వీణ తీస్తాను. గట్టిపడిపోయిన రంగులు, కుంచెలు సరిచేసి బొమ్మలు వేయడం ప్రారంభిస్తాను. అరె! అది నే చదవలేదే అన్న ప్రశ్నలేకుండా కృష్ణ మూర్తిని ఆశ్చర్యంలో ముంచెత్తి వేస్తాను. నా వీణ పాట విని:

'ఇంత బాగా వాయిస్తావు, నా కెప్పుడు వినిపించలేదేం పార్వతీ!' అంటాడు కృష్ణమూర్తి.

'నువ్వు అడిగితే కదా? అయినా నా కప్పుడు తెరిపి లేదు కృష్ణ ... ఈ విశ్రాంతిరోజులకోసం ఎంతగా ఎదురు చూశానని! అంటాను' అనుకుంది పార్వతి. 'నే వేసిన బొమ్మలు చూసి ప్రముఖులే ముక్కుమీద వేలు వేసుకుంటారు!' మైకంలో పడ్డట్టు మగతలో పడింది పార్వతి.

'ఇక్కడా ఉన్నావు? ఆకలితో చస్తూంటే!' గుమ్మంలో నిలబడి అడుగుతున్నాడు నానిగాడు. 'అప్పుడే




మధ్యాహ్నం అయిందా?' ఒక్క ఉదుటున లేచింది పార్వతి. 'ఎన్నిసార్లు పిలిచినా పలకవేం?' అప్పుడే కోపంతో ముఖం ముడుచుకుపోయింది నానిగాడికి.

"నిద్రపోయాను నాన్నా. ఇదిగో ఓ క్షణంలో అన్నం పెట్టేస్తాను" అంటూ ఒంట్లో బాగుండకపోవడం, సంగీత సాధన, బొమ్మలు గీయడం — అన్నీ మరిచి, హడావిడిగా వంటింట ప్రవేశం చేసింది పార్వతి. అప్పటికే ఉప్పు వేసి ఉడికించి ఉంచిన చిన్న చిన్న బంగాళా దుంపలు తీసి చూస్తున్నాడు నానిగాడు. 'అవి రాత్రికి వేయిస్తాను. తీయకు' అంది. 'సరే, ఒకటి తీసుకుపో; చేతులు కడుక్కురా' అంది.

వాడికి భోజనం పెట్టి, అన్నీ సర్ది, హాల్లోకి వచ్చింది పార్వతి. పండగ ఇంకా రెండువారా లుంది. 'కాలం ఎలా పరుగెడుతుంది? దానికి విశ్రాంతి అవసరంలేదు కాబోలు!' అనుకుంది. 'ధర్మామీటరు ఎక్కడ పెట్టానో? ఒంట్లో బాగులేదంటే — కృష్ణమూర్తి ఏమంటాడో? ఇప్పుడిప్పుడే కొంచెం వెనకేస్తున్నది కాస్తా ఈ పాపకి కర్చయిపోతుందా? "ఈ పాప నా కొద్దు; నాకు విశ్రాంతి కావాలి. నా కీ పాప వద్దు బాబూ," అని నిట్టూర్చింది. కిటికీలోంచి చూస్తూంటే — తను తలపోసిన ఊహలన్నీ పండుటాకులు రాలిపడుతున్నట్టు నేల రాలిపోయాయి అనిపించింది. ఎప్పుడు లోపలికి వచ్చాడో కృష్ణమూర్తి.

"ఇక్కడా ఉన్నావు?" అంటూ పార్వతిని పొదివి పట్టుకున్నాడు.

"అందరూ నన్నిలాగే పల్కరిస్తారేం? 'ఇక్కడా ఉన్నావు?' అంటూ? అందరిలాగా హల్లో అనో ఓ చిరునవ్వు

తోనో న న్నెందుకు పల్కరించరు?" అంది పార్వతి. "నీకోసం చూస్తున్నాను కాబట్టి;" ఒక్కముక్కలో సమాధానం చెప్పి పార్వతిని హృదయానికి హత్తుకున్నాడు కృష్ణమూర్తి. "నిన్ను గురించే ఆలోచిస్తాం గాబట్టి." అంటూ పార్వతి పెదవులపై గాఢంగా ముద్దు పెట్టుకున్నాడు.

"నా ఒళ్ళు వేడిగా ఉందా?" అడిగింది పార్వతి. "జ్వరం వచ్చినట్టుంది. ధర్మామీటరు మళ్ళీ ఎక్కడో పెట్టేసినట్టున్నాను."

"నాన్సెన్స్! నీకు జ్వరమేమిటి?" అని కౌగలి బిగిస్తూ "వెచ్చగావున్నావు!" అన్నాడు బొంగురుపోయిన కంఠంతో.

"జర్వం లేదా?" ఆశ్చర్యంగా అడిగింది పార్వతి.

"లేదు. కావాలని ఉందా?" చిలిపిగా అడిగాడు కృష్ణమూర్తి.

"వచ్చినట్టుందే పొద్దుట" అంది పార్వతి.

"పార్వతీ, మనం ఎంత హాయిగా ఉన్నాము; ఈరోజులు గడిచిపోనివ్వను పార్వతీ.ఇవేకదా కోలుకోతగ్గరోజులు?" అంటూ చిరుచెమటలతో తడిసిన పార్వతి ముంగురులు సరిచేశాడు కృష్ణమూర్తి.

ఇవా కోలుకోతగ్గ రోజులు?? ఊపిరి సలపని రోజులు!!

'సంవత్సరాలు క్షణాల్లా దొర్లిపోతాయి' అంటున్నాడు కృష్ణమూర్తి.

'ఈ సారి జాగ్రత్తగా ఉంటాను_ ముందటిలాగే మెనతేలి. తన వేళ్ళ కొనలని చూసుకుంటూ అనుకుంది పార్వతి. 'బొమ్మలు.. కుంచెలు.. ముఖమల్ లాంటి పసివాని చెంపలు నిమురుతాయి వేళ్ళు' అనుకుంది. "పాప వస్తే ఈ చేతులకి మళ్ళీఎంతపని?" అంది.

"ఏమిటి పార్వతీ! మళ్ళీ పాపాయి!! మైగాడ్, నిజంగా నువ్వు క్రియేటివ్ జీనియస్‌వి!" అంటూ ఆశ్చర్యంతో తబ్బిబ్బు అయే కృష్ణమూర్తి చేతుల్లోంచి తప్పించుకొంటూ_

"మధ్యాహ్నం భోజనం వద్దేమిటి?" అంటూ దారితీసింది. వెడుతూంటే దార్లో పేపర్లమీద కనపడ్డ ధర్మామీటరుని తీసుకువెళ్ళి పోపులడబ్బా వెనక దాచింది పార్వతి. 'అక్కడే అది జాగ్రత్తగా ఉంటుంది' అనుకుంది!

ఆశ్చర్యంనుండి తేరుకోకుండానే కృష్ణమూర్తి వంటింట్లోకి వచ్చాడు. "నువ్వెప్పుడూ 'బ్యాచిలర్ స్వప్నం' లాగా ఉంటావు నాకు," అంటూ పార్వతి చేతిలో గరిటె పక్కన పెట్టి తన కౌగిలిలోకి తీసుకున్నాడు తిరిగి 'ఈసారేనా మోసంచేయకు నీలాంటి అమ్మాయి వద్దా మనకు." అంటూ విప్పారిన పార్వతి కళ్ళలోకి చూశాడు కృష్ణమూర్తి. అనుకోకుండానే అతని మెడచుట్టూ తన చేతులు వేసి, అతని మెడవంపులో ముఖం దాచుకుంది పార్వతి.